




## దర్శనీయ వ్యక్తి

## నిసార్ / హైదరాబాద్




*ఓ మనిషి తన ఒట్టి చేతులతో అద్భుతాన్ని సృష్టించగలడంటే నమ్ముతారా? అందుకే చూడమనడం. ఈయన ఒక దర్శనీయ వ్యక్తి అని రాయడం. మరి చదవండి.....*

## ఉపోద్ఘాతం:

మానవ సంబంధాల్లోని మంచితనాన్ని అర్థం చేసుకోవడానికి సుదీర్ఘకాలం గమనించే అదృష్టం ఉండాలి.

- ఈ వాక్యం రాసిన ఫ్రెంచి రచయిత ఒకరు నాలో తెలియని ఆందోళన కలిగించారనే చెప్పాలి.

ఒక సామాన్యుడు అని అంటున్నప్పుడు, ఆ వ్యక్తి గురించి ప్రపంచానికి పరిచయ పత్రం ఇస్తున్నప్పుడు ఏ రచయితకయినా ఆ మనిషి పని తీరు ఏ మాత్రం అహంకారం లేనిదని, దానికి ప్రేరణ అసమానమైన ఔదార్యం అనీ, అందులో ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేదని ధ్రువపడాలి. అది దీర్ఘకాలిక పరిశీలనలోనే నిగ్గు తేలాలి. ఇవన్నీ ఉంటే ఈ భూమ్మీద ఆ మనిషి ప్రత్యక్ష ముద్ర తప్పక ఉంటుంది.

కానీ అటువంటి వాళ్ళు ఎందరుంటారు?

చాలామందే.

అవును, ఈ సందేహాలన్నిటినీ పటాపంచలు చేసే వ్యక్తులు చాలామందే ఉన్నారు. జాగ్రత్తగా గమనిస్తేగానీ అటువంటి నూతన మానవులు మనలోనే ఉన్నారన్నది తెలియదు.

ఉదాహరణకు నిసార్.

అతడు ఒట్టి చేతులతో అద్భుతాన్ని సృష్టించగలడని ఇప్పటిదాకా ఆ బస్తీవాసులకే తెలుసు. అదేమిటో చెబితే, ఇంతేనా అనవచ్చు మీరు. అందుకే చూడమనడం. నిసార్ ఒక దర్శనీయ వ్యక్తి అని రాయడం.

1

ఆయన్ని తొలిసారి రెండేళ్ళ క్రితం చూడటం.

మళ్ళీ ఇప్పుడు.

ఎవరో అన్నారు.

మొదట నాలుగేళ్ళ క్రితం చూశానని.

మరొకరన్నారు, పదహారేళ్ళక్రితం అని.

ఈయనే అన్నాడు, పద్దెనిమిదేళ్ళయింది ఇక్కడకు వచ్చి అని.

అప్పటినుంచీ ఆయన్ని ఎందరో చూస్తున్నారు.

అవును. ఆయన ఎక్కడో ఆల్ప్ పర్వతాలలో యాత్రికులకు తెలియని కొండ ప్రాంతాల్లో లేడు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన హైదరాబాద్‌లో, అమీర్‌పేట సమీపంలోని ధరంకరణ్ రోడ్డులో ఉన్నాడు. అందువల్లే ఆయన పనితీరును దగ్గరగా పరిశీలించే అదృష్టం అక్కడి చాలామందికి లభించింది.

ఇంతకీ ఆయనేం చేస్తాడు?

కూరగాయల విక్రయం.

ఉదయం ఏడు నుంచీ మొదలై మధ్యాహ్నం రెండుదాకా అతడిది కూరగాయల వ్యాపకమే.

అది కాదు విశేషం. అతడు కూరగాయలు అమ్ముతాడు. కానీ తూకం మాత్రం వేయడు. అదీ విశేషం.

సవాసేరు, పావుకిలో, అరకిలో, కేజీ... మీరు చెబుతూ పొండి.

అతడు తన రెండు చేతులతో మీరు అడిగినన్ని కూరగాయలు పెడుతూ పోతాడు.

అదొక అద్భుత దృశ్యం.

మొదట్లో నమ్మడానికి కుదరదు. కానీ చూస్తుండగానే అది చాలా సహజమైన విషయంగా మారిపోయి, అసలు ఇలాగే కదా కూరగాయలు ఇవ్వాల్సింది అన్నట్టుగా మీ చేతన సైతం మార్పుకు లోనవుతుంది.

అంటే ఒకరకంగా అపనమ్మకం కాస్త నమ్మకంగా మారిపోయి, ఆ మీదట అది అద్భుతంగా కాక అత్యంత సహజమైన విషయంగా మీలో స్థిరపడుతుంది.

అప్పుడు పరస్పరం ఉద్భవించే చిరునవ్వు గురించి కూడా తప్పక రాయాలి. ఎందుకంటే అదొక మేలుకలయిక. దానికి గుర్తుగా వ్యక్తమయ్యే అభినివేశం.

నిజం, నమ్మండి - తరాజు, త్రాసు, తక్కెడ, కాత, బాటు, - మీరేమైనా అనండి. వాటిన్నిటినీ పక్కన పెట్టిన సున్నితపు త్రాసు అతడు.

అదే అతడి ప్రత్యేకత. అంతకన్నా మరేమీ లేదని మనవి.


సహజ కృత్యం

## 2

అన్నట్టు, తూకం వేయడం అలవాటే లేదంటున్న ఈ చిరువ్యాపారిని అంతకే పరిమితం చేయదలచుకోలేదు. కాస్త అటూ ఇటూగా రాసే ప్రయత్నంలో ముందు అతడి గురించిన ముఖాముఖి:

అతడ్ని మీరు ఎప్పట్నుంచీ చూస్తున్నారు?

మేం త్రీ ఇయర్స్ పై నుంచే చూస్తున్నామండీ. మాకేం తేడా రాదు.. బానే ఉంటుందండీ, చెబుతోంది ఒకావిడ.

ఆవిడ ఉదయాన్నే ఎనిమిదింటికి ఇతడి వద్దకు వచ్చి కూరగాయలు కొనుక్కుని వెళుతుంది.

మీరు పావుకిలో, అరకిలో అని అడుగుతారా? అంటే, అడుగుతామండీ. పావు కావాలంటే పావు, అరపావు కావాలంటే అరపావు పెడతాడండి, చెప్పారావిడ.

మీకేమనిపిస్తుంది?

ఆమెకు ఏం చెప్పాలో తెలియలేదు.

మీరెక్కడైనా ఇట్లాంటి మనిషిని చూశారా? మరో ప్రశ్న.

తక్కెడ వాడకుండా కూరగాయలు అమ్మడాన్ని చూశారా? మరో ప్రశ్న

ఎక్కడా చూళ్ళేదండీ. మా కందుకే నచ్చింది. ఇక్కడకే వస్తాం. ఆయన లేకపోతే లేదా ఇంకేమైనా అవసరం అయితే... అప్పుడు ఎర్రగడ్డ మార్కెట్‌కు వెళతామండి. కానీ ఇక్కడైతే ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా తీసుకోవచ్చు. అక్కడైతే వారం కొకసారి. అందుకే ఇక్కడకే వస్తాము.

ఓ రూపాయి ఎక్కువైనా తక్కువైనా ఇదే హాయిగా ఉంది. అలా అని ఇక్కడ ఖరీదు  కాదు. నిజానికి ఇక్కడే చవక, వివరించింది.

మరొకరు:

14 ఏళ్ళుగా ఇక్కడే తీసుకుంటున్నాం. మంచిగ ఇస్తడు. ఫ్రెష్‌గా తెస్తడు. నిల్వ ఉండవు. తూకం కూడా బాగా ఇస్తడు. తూకం అంటే తూచడు. అలా తీసి వేస్తాడు. మేం కూడా ఇంత రేటా అంత రేటా అని కూడా అడగం. ఎంత అంటే అంత పైసలిచ్చేస్తాము, మంచిగనిపిస్తది, వివరించిందావిడ.




తూకం ఎందుకు వేయవు? అంటే అలవాటు లేదు సార్ అన్నాడు పోనీ, మొదట్లో తూకం వేసేవాడివా? అని అడిగితే లేదన్నాడు. ఎప్పుడూ వేయలేదన్నాడు, మళ్ళీ చెప్పిందావిడ.

ఈ మాటలు వింటున్న నిసార్ జోక్యం చేసుకుని, ఇంతవరకూ తూకమే లేదుమాకు, అన్నాడు.

కూరగాయలు, ఆకు కూరలు అన్ని రకాలుంటాయి. ఒక్క టమాట తప్ప. చలికాలంలో కూరగాయలు పెట్టడానికి జాగా సరిపోదు. గేటు బయట కూడా అమ్ముతాను, వివరించాడాయన.

నిసార్ చెప్పేది విని ఒక యువతి అందుకుంది.

ఫంక్షన్లు ఉన్నప్పుడు ఫలానా కూరగాయలు కావాలంటే తెచ్చిస్తాడు. దాంతో మాకు మార్కెట్‌కు వెళ్ళే అలవాటు తప్పిపోయింది, నవ్వి చెప్పిందామె.

ఇంకా అతడు గురించి చాలా చెప్పొచ్చు, ఇంట్రెస్టింగ్, ఎప్పుడూ కూల్‌గా ఉంటాడు, అంది. పేరడిగితే, ఎందుకూ? అంది.

నిసార్ బండి చుట్టూ ఉన్న అమ్మలక్కలు తలా ఓ మాట పంచుకున్నారు. అందరూ అభినందనగానే చెప్పారు.

ఒకామె అంది. ఉదయాన్నే ఇక్కడికి రావడమే రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. ఆవిడ పేరు లత.

వాకింగ్‌కు వెళుతూ కూరగాయలు తీసుకువెళతాం. తాజా కూరగాయలతో కూడీ, ఓ మంచి ఫీలింగ్‌తో ఇంటికి వెళతాం.

3.

ఇక్కడ ఆపి మరలా ప్రారంభించాలి.

4

ఒక మనిషిని పరిచయం చేయడం అటే ఆ మనిషి పగటి జీవితాన్నేకాదు, రాత్రి జీవితాన్ని కూడా చెప్పాలి. రాత్రింబవళ్ళ మధ్య గడిచే క్షణాలను కూడా పరిచయం చేయాలి. అందుకే నిసార్ కూరగాయలు అమ్మడానికి ముందు జరిగే కథనం చూడాలి.

## 5

నిసార్ దినచర్య ఉదయం మూడున్నరకు ప్రారంభమవుతుంది.

ఇప్పుడు మూడున్నరే అయింది.

మనం సరిగ్గా ఆయన ఇంటిముందు చిమ్మచీకట్లో ఉన్నాం.

గేటు వేసి ఉంది.

నిసార్.... గట్టిగా పిలవాలి.

......

గేటు తట్టినా లాభం లేదు.

ఆయన తన ఇంటి ముందుకు ఒక ఆటో ట్రాలీ వస్తేగానీ లేవడు. ఆ చప్పుడే అతడికి అలారం.

ఇంకాసేపట్లో ఆ ట్రాలీ వస్తుంది. అది అలా వచ్చీ రాగానే ఈ కూరగాయల వ్యాపారి జీవన వ్యాపారం ప్రారంభం అవుతుంది.

అన్నట్టు మనం ఎక్కడ ఉన్నాం.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని అమీర్‌పేట పరిసర ప్రాంతం ఇది. దీన్ని ధరమ్ కరణ్ రోడ్డు అని పిలుస్తారు. ఇక్కడ గాంధీ ప్రకృతి వైద్యశాల తాలూకు బాలుర వసతి గృహం ఉంది. దాని ఎదురుగా మజీద్... దాని పక్క ఇల్లే నిసార్‌ది.

అది ఒక నవాబ్‌ది.

ఆయన తన ఇంటి ముందే నిసార్ కుటుంబం ఉండటానికి ఎంతో ఉదారంగా అంగీకరించారు.

అద్దె ప్రసక్తి లేదు.

అది రెండు గదుల ఇల్లు. ఇంటి ముందు విశాలమైన ప్రదేశం. దానిముందు గేటు. ఆ గేటు తీసుకుని వస్తున్నాడు నిసార్. ట్రాలీ వచ్చింది మరి!

## 6

ఈ ఆటో ట్రాలీ తన స్నేహితుడి కుమారుడు, ఆనంద్‌ది.

గుడగుడమని అది శబ్దం చేస్తుంటే చేతుల్లో కొన్ని చేసంచులతో నిసార్ బయటకు వచ్చాడు.

నిద్రకళ్ళతో అలాగే వస్తూ వస్తూ ఆ బ్యాగ్స్‌ను ట్రాలీ వెనకాలకు విసిరేసి డ్రైవర్ సీట్లో ఉన్న ఆనంద్ పక్కనే కూచున్నాడు.

ట్రాలీ బయలుదేరింది.

## 7.

ఇంతకీ నిసార్ ఎక్కడకు వెళుతున్నాడు?

గుడిమల్కాపూర్ మార్కెట్‌కు.

ఎంత త్వరగా వెళితే అంత తాజా కూరగాయలు దొరుకుతాయట.

అతడిని వెంబడించి వెళుతుంటే, మున్సిపల్ సిబ్బంది కొందరు వీధి దీపాల వెలుతుర్లో చిమ్ముతున్నారు. మధ్య మధ్య రోడ్డుమీంచి ఝుమ్మని కార్లు, వాటి తాలూకు వెలుతురు టార్చిలైట్ మాదిరిగా వాటితో పాటు పరుగెడుతోంది.

రోడ్లు, ఫ్లైఓవర్లు దాటి వెళుతుండగా ముసాబ్ట్యాంక్

అక్కడి డైమండ్ హోటల్ వద్ద ట్రాలీ ఆపి దిగారు.

నిమిషంలో నిసార్, ఆనంద్ టీ తాగి ఉత్సాహాన్ని ఒంపుకున్నారు.

మళ్ళీ స్టార్ట్.

పదినిమిషాల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ ప్రాంగణంలో ట్రాలీ ఆగింది. డోర్ తెరచుకుని దిగిన నిసార్ జేబులోంచి నోట్ల కట్ట తీసి డబ్బులు లెక్కపెట్టుకుంటున్నాడు. వాటిల్లోంచి కొన్ని నోట్లు తీసి ఆనంద్కు ఇచ్చాడు. ఆ తర్వాత మార్కెట్లోపలకు దారితీసే కమాన్ కిందుగా నడిచి - ఒకరు కుడివైపు మరొకరు ఎడమవైపుకు మరిలారు.

ప్రతిరోజూ ఇక్కడకు రావలసిందే ఇంటి నుంచి మూడున్నరకు బయలుదేరితే ఆరున్నర దాకా ఇక్కడే ఉంటారు.

డ్రైవర్ ఆకు కూరలు, తానేమో కాయగూరలు విక్రయిస్తారు.

టమాట తప్ప అన్ని రకాలవీ కొంటారు.

ముందునుంచీ అదే అలవాటట.

చిమ్మని చీకటి... అంబరం నీలాంబరంగా మారుతుండగా వారి పని దాదాపు పూర్తవుతుంది.

విశాలమైన మార్కెట్లో సందడే సందడి!

అంత ఉదయాన్నే మనుషులు కూరగాయల్లో కూరగాయలై, ఒకచోట కొత్తిమీరె మరోచోట పుదీనా అయి వాసన వేస్తున్నారు చెమట వాసన లేదు. అంతా తాజా పరిమళం.

అప్పటికే భుజం మీద కూరగాయల బస్తా బరువైపోయింది నిసార్కు. అడిగాను, ఎన్ని బ్యాగులు తెచ్చావూ అని.

ఏమో... తెలవదు సార్, అన్నాడు.

అందాదకు చెప్పు?

ఏమో సర్. ఆలోచించలేదు.

మళ్ళీ తానే, పదిహేనుంటాయా? అని అడిగాడు.

దాదాపు పదిహేను బ్యాగులనిండా కూరగాయలు కొని ఒక్కొక్కటీ నిదానంగా ట్రాలీ వద్దకు తెచ్చాడు.

తనలో తాను అనుకున్నట్టు, ఇక్కడ ఉద్దర ప్రసక్తి లేదు. అంతా నగదే, చెప్పాడు నిసార్.

అన్నట్టు, టమాటాలు ఎందుకు కొనవు?

పగిలిపోతాయి సార్, అన్నాడు.

మరో క్షణం అయ్యాక, మొదటినుంచీ అలవాటు లేదు.



అలవాటు!

అవును. మంచిగానీ చెడుగానీ, ఒకసారి గ్రహించాక మంచివైపే లేదా అనుకూలత వైపే ఉంటాను అన్నట్టు చెప్పాడాయన.

## 8

నిసార్, మార్కెట్లో మొత్తం ఎన్ని వందల రూపాయల కూరగాయల కొంటావు నిసార్? అడిగాను.

పన్నెండు, పదమూడు వందల కూరగాయల కొంటాను.

ఆకు కూరలు... అవి ఓ మూడూ వందలవి కొంటాను.

మొత్తం ఓ పదిహేను వందల దాకా కొంటాను, వివరించాడు.

ఎన్ని సంవత్సరాల నుంచీ ఈ పనిలో ఉన్నావు?

పద్దెనిమిదేళ్ళు.

అంతకుముందు?

పాత పేపర్లు

ఆ మాట చెప్పి, ఇప్పటికీ పాత పేపర్ల వ్యాపారం చేస్తాను మధ్యాహ్నం తర్వాత... చెప్పాడాయన.

నీ వయసెంతుంటుంది?

38

ఏం చదువుకున్నావ్?

చదవలేదు.

మరి థర్టీ ఎయిట్ అన్నావు?

ఏదో సార్. కొన్ని ఇంగ్లీషు పదాలు వచ్చినయ్, నవ్వి చెప్పాడు.

మీది ఇక్కడేనా?

కాదు, కర్నాటక.

అమ్మనాయన?

అక్కడే ఉంటారు. అప్పుడప్పుడు పోయొస్త.

మాట్లాడితే పని కాదన్నట్టు ఆయన మళ్ళీ వెళ్ళి ఇంకొన్ని కూరగాయల బ్యాగ్స్ ట్రాలీ వద్దకు తెచ్చాడు. ఇంతలో ఆనంద్ మరికొన్నిటితో వచ్చాడు. ఇద్దరూ ఏదో మాట్లాడుకుని, మార్కెట్లో పని అయిపోయింది అన్నట్టు వెనుదిరిగారు.

ట్రాలీ కదిలింది మళ్ళీ.

## 9.

తిరిగి వస్తుంటే డైమండ్ హోటల్ వద్ద ఆగింది ట్రాలీ.

మరో ఛాయ్.

సిగరెట్టు అలవాటుందా?

లేదుసార్, పాన్... కాశ్మీర్ బాబా.. అంటూనే అటువైపు తెరిచి ఉన్న షాపు వద్దకు వెళ్ళాడు నిసార్.

రోజుకు ఎన్ని తింటావు?

ఐదారు.

కట్టిన పాన్ ఒకటి జేబులో వేసుకుని, మరోటి నోట్లో కుక్కుకుని చిన్నగా నవ్వుతూ మెట్లు దిగాడు నిసార్.

నిసార్ కూచోగానే ఆనంద్ ట్రాలీని ఇంటివైపు పోనిచ్చాడు.

ఇల్లు మరో ఫర్లాంగ్ ఉందనగా నిసార్ ట్రాలీ ఆపించుకుని దిగేశాడు. ఆ ట్రాలీ అదే వేగంతో ఇంటికి వెళ్ళేలోగా తాను పొరుగున ఉండే మరో కూరగాయల వ్యాపారి వద్దకు వెళ్ళి, ప్రస్తుతానికి ఆయన అక్కడ లేడు. కానీ రోజువారి అలవాటుగా ఆయన తోపుడు బండి తీసుకుని పరుగువంటి నడకతో దాన్ని తోసుకుంటూ తన ఇంటికేసి బయలుదేరాడు నిసార్.

దాదాపు రెండు దశాబ్దాలుగా కూరగాయలు అమ్ముతున్నా నిసార్‌కు సొంత తోపుడు బండీ లేదు.

అదేమిటి నిసార్? అంటే, నవ్వి ఊరుకున్నాడు.

కొనాల్సినవన్నీ కొన్నానా? అన్నట్టుందా నవ్వు.

అతడు ఇంటికి చేరుతుండగా పక్కింట్లోంచీ సుప్రభాతం వినిపించసాగింది.

ఆ శ్రావ్యమైన మంగళ సంగీత ధ్వనుల నేపథ్యంలో నిసార్ ఇపుడు మరో ఆసక్తికరమైన దృశ్యానికి తెరలేపనున్నట్టు మరింత ఉత్సాహంగా కనిపించాడు.

నిసార్ ఆ ట్రాలీలోంచి బ్యాగ్స్‌ను గేటులోపలి ప్రదేశంలో పెట్టాక ఒక్క క్షణం అయినా విశ్రాంతి తీసుకోలేదు. అలసట చెందినట్లు కూడా కనిపించలేదు. తాను తెచ్చిన కూరగాయలను చకచకా తోపుడు బండిపై సర్దడంలో లీనమయ్యాడు.

వాటిపై నీళ్ళు చల్లడం కూడా ఒక మనోహరమైన దృశ్యం.

ఆయన ఆ పని పూర్తి చేయనైనా లేదు. నేరుగా ఇంటికి వచ్చి కొనుక్కునేవారు కొనుక్కోవడం మొదలెట్టనే పెట్టారు.

ఏముంది.



గంపెడు సంసారంలో ముగ్గురు పిల్లలు

వారు రెండు రూపాయల మిరపకాయలు అంటారు.

ఆయన రెండు చేతులను మిరపకాయల్లోకి దొనిపి దోసిలి నిండా వాటిని ఇముడ్చుకుని కొంగు పడితే కొంగులో, ఏదైనా పాలిథిన్ కవర్ పడితే అందులో పోస్తాడు.

మళ్ళీ ఇంకొకరు.

ఇట్లా వస్తూనే ఉంటారని ఆయనకు తెలుసు గనుక, ఒక్క క్షణం ఆయన పని ఆపి ఇంట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని టీ తాగేసి వచ్చాడు.

ఈ ఒక్కరికి కూరగాయలు పెట్టడం మీరు చూశారు కదా, నిజానికి వారు రాకమునుపు దాకా జరిగిందంతా - అంటే మార్కెట్‌కు వెళ్ళడం, కూరగాయల వ్యాపారికి తేడా లేదు. ఇకముందే ఆయన ప్రత్యేకత కనిపిస్తుంది.

ముందే చెప్పినట్టు, ఆయన తూకం లేకుండా కూరగాయలు అమ్ముతుంటాడు. అదే ఆయన ప్రత్యేకత.

ఎవరికి ఏం కావాలో అవన్నీ పెడతాడు. ఆ తర్వాత వారు పావుకిలో పాలకూర అంటారు. ఆయన రెండు రూపాయలు అంటాడు, అరకిలో ఆలుగడ్డలు అంటారు. నాలుగు రూపాయలు అంటాడు. ఇట్లా వారు తీసుకున్నవి చెబుతారు. ఆయన వాటి ఖరీదు చెబుతాడు. ఇట్లా వారు తీసుకున్నవి చెబుతారు. చివరకు ఆయన 26 రూపాయలు అంటాడు. వారు తీసిస్తారు. ఇచ్చి వెళ్ళిపోతారు.

డిస్కషన్ ఉండదు.

కొసరూ అడగరు.

కాకపోతే ఒక గర్భవతి కూరగాయలు కొనుక్కుని వెళుతూ వెళుతూ తోపుడు బండి చివరగా ఉన్న గంపలోంచి తనకు ఇష్టమైన దోసకాయ తీసుకు కొరుక్కుని వెళుతుంది.

ఆమె ముఖం ఈయనకు కనపడదు. ఈయన నవ్వు ఆమెకు కనిపించదు. కానీ ఒక పరిచయం, చొరవ, ఆత్మీయతా - అన్నీ కలగలసిన జాడలు అక్కడ అరుదైనవేమీ కావు.

మామూలే.

## 10

నిసార్ ఇంటి ముందు ఉండే సమద్‌ను ప్రశ్నిస్తే ఇలా అన్నాడు, ఆయన దగ్గర బెస్ట్ థింగ్ జోకక పోవడం. బాటూ తక్కెడతో ఆయనకు పనేలేదు. ఐడియాతో వేస్తాడు. ఎక్కువనే వస్తాయి. అదీగాక ఆయన మంచి నైబర్. మంచి వ్యక్తి, అభిమానంగా చెప్పాడు.

మధ్యాహ్నం పదకొండు వరకూ ఇంటివద్దే అమ్ముతాడు నిసార్. ఆ తర్వాత మిగిలిన కూరగాయలు, ఆకుకూరలతో రెండూ ఫర్లాంగుల దూరంలో... అదే వీధి మలుపులో ఉండే ఫంక్షన్ హాల్ వద్దకు తోపుడు బండి తీసుకువెళతాడు. అక్కడ మధ్యాహ్నం రెండు దాకా అమ్ముతాడు. అక్కడే ఆయన నోటివెంట పెద్దగా కూరగాయాలూ... అని వినిపిస్తుంది.

ఆ వీధిలో ఆయన గొంతు వినిపించడం ఆగిపోయిందంటే నిసార్ ఇంటికి వచ్చేశాడని అర్థం. భోజనం చేసి పాతపేపర్ల వ్యాపారంలో పడిపోతాడు, వివరించాడాయన.

సమద్ చెప్పిన ఆ ఫంక్షన్ హాల్ దగ్గర ఒకతనితో మాట్లాడితే ఇలా చెప్పాడు. తన పేరు అభినందన్ జైన్ అంటూ చెప్పాడాయన. నిసార్ అందాద మీద అమ్ముతాడు. ఎవరూ తక్కువైనయని అనరు. ఇక్కడే బండి కాళీ అవుతుంది. నేను ఇట్లాంటి మనిషిని చూడటం ఫస్ట్‌టైం. ఆయన మంచితనానికి ముచ్చటేస్తుంది, ప్రేమగా చెప్పాడు.


మైబూబ్

ఇక్కడకు వేరే తోపుడు బండులు కూడా వస్తాయి. కానీ బస్తీ వాసులు వాళ్ళ దగ్గర తీసుకోరు. నిసార్ దగ్గరే సంతోషంగా కావలసినవి కొనుక్కుంటారు, మళ్ళీ వివరించాడాయన.

ఆయన చేతిమీద ఎక్కువనే వస్తాయని తక్కువ రావు. తరాజు జోకుడు లేదు. నాక్కూడ అనుమానం వచ్చి అడిగిన. లాస్ అవుతువు కదా బిడ్డా, ఎట్ల చేస్తున్నవూ అని. కానీ చేయిగుర్తు తెలిసిపోయింది. దొరికిపోయింది. ఇంకేం భయం? చేసుకుంట పోతున్నడు, వివరించాడు.

## 11

చేయిగుర్తు!

అవును, చేతి గురుతు. అదే ఆయన సూత్రం. ఆ సూత్రంతో పనిచేసుకుంటూ పోతున్నాడు ఈ మాదిరి మరొకరు చేయలేరు. చేస్తే ఛాలెంజ్ అని కూడా అన్నాడు నిసార్, అడిగితే.

మళ్ళీ లస్మయ్యనే అన్నాడు, నిసార్‌ది పెద్ద సంసారం. అయినా బతుకు బండీ బాగానే లాగుతున్నాడు, అని.

నిజంగానే నిసార్‌ది పెద్ద ఫ్యామిలి.

నిసార్ మాటల్లో ఆయనకు ఆరు బిడ్డలు, రెండు కొడుకులు.

పెద్ద కూతురిని నాంపల్లికి ఇచ్చాడు. అల్లుడు టైలరింగ్ చేస్తాడట.

రెండో కూతురు కూడా యుక్త వయస్సుకు వచ్చింది. చన్నీళ్ళకు వేన్నీళ్ళు తోడు అన్నట్టు ఇళ్ళల్లో వంట చేయడానికి వెళుతుందామె. ఫోటో తీసుకుంటానంటే, వద్దు వద్దు అంటు బురఖాను ముఖం మిదకి లాక్కొని, బై... అంటూ తుర్రుమంది.


ముషీరా

మిగతా పిల్లలు?

మొదటి అమ్మాయి... ఫాతిమా.

ఇంతకుముదు చెప్పినట్టు వివాహం అయిన అమ్మాయి. రెండో అమ్మాయి అసియా.

ఇప్పుడే వంట చేయడానికి వెళ్ళింది ఈ అమ్మాయే.

మూడో అమ్మాయి షహనా.

నాలుగు, ముషిరా.

ఐదు, సమీరా.

ఆరు, అర్షియా.


సమీరా

వీడు అబ్బాయి.

ఏడు, మైబూబ్.

ఎనిమిది, ముస్తఫా.

ఏడు, ఎనిమిది కూడా అబ్బాయిలే

ఇక వీళ్ళ తల్లి అంటే నిసార్ భార్య ఆమె మాలన్ బీ.

తామిద్దరి స్వగ్రామం కర్నాటకలోని సేదు, చెప్పిందావిడ.

ఇంతపెద్ద సంసారాన్ని ఎట్లా ఈదుతున్నావయ్యా అంటే నాదేం లేదు సార్, అంతా దేవుడి దయ, అన్నాడూ నిసార్.

అంతా ఆయన చేతుల్లోనే ఉంది, అన్నాడు

మంచిగ తింటున్నం, హాయిగ ఉన్నం, అని కూడా అన్నాడు.

అంత పనిలో ఉండీ టీ తాగించి మరీ చెప్పాడాయన.


షహానా

12

హాయిగ మంచిగ ఉన్నాం.

ఈ మాట చెప్పడానికి ఆయన వెనుకాడలేదు. కానీ , ఎంత మంది ఇలా అంటున్నారు. డబ్బు హోదా, అన్నీ ఉండి సంతోషంగా ఉన్నాం అని!

కానీ నిసార్ ప్రశాంతంగా, ఆనందంగా ఉన్నాడు.

ఆయన భార్య కూడా.

ఆమె నింపాదిగా కూరగాయల పనిలో. పిల్లలూ అంతే. కూరగాయల్లో నిమగ్నమై పచ్చగా ఉన్నారు. వెనకాల సుప్రభాతం ఇంకా వినిపిస్తోంది.

రెక్కలు ముక్కలు చేసుకుని బతుకుతున్నాం అనే విచారం ఈ కుటుంబంలో ఏ కోశానా వ్యక్తం కాలేదు. ఇంకా నిసార్ అన్నాడు, పిల్లలు చదువుకుంటున్నారు అని. అది కూడా ఆనందంగా చెప్పాడు.

కానీ ఇంట్లో చూస్తే ఏమీ లేవు.

ఏదో ఉన్నాం అంటే ఉన్నాం అన్నట్టున్నారు వాళ్ళు.

పిల్లల బట్టలు కూడా బాలేవు. కానీ నవ్వుల పువ్వుల్లా ఉన్నారు.

## 13

అడిగితే అన్నాడు, సమస్యలు ఎందుకుండయి, ఉంటయి, అని.

అది కూడా చాలా మామూలుగా అన్నాడు. సమస్యలు ఉంటే మాత్రం ఏమిటి? అన్నట్టు అన్నాడు.

చివరగా ఆయన్ని ఒక ప్రశ్న అడిగాను. ఇట్లా తూకం లేకుండా ఎలా అమ్మగలుగుతున్నావూ? అని.

నాకు ఇదే అలవాటు, నమ్మకంగా చెప్పాడాయన.

నా దగ్గర తూకం లేదు. కొత్తగా ఆ అవసరం రాదు కూడా, అపరిమిత విశ్వాసంతో అన్నాడు. ఇంకో విషయమూ అన్నాడు.

తనలాగా ఎవరైనా అమ్ముతారని కూడా ఆయన భావించడంలేదు. ఎవ్వరూ అమ్మరు సార్. వాళ్ళకు భయం, అని కూడా చెప్పాడు.

భయం!

అవును భయం.

తాను దాన్ని అధిగమించానూ అన్న స్పృహతో ఆ మాట అన్నాడు.

ఛాలెంజ్ చేస్తాను. ఎవరైనా అమ్మితే, అని కూడా అన్నాడు అందులో అహంభావం లేదు. తాను అసాధ్యమైన పని చేస్తున్నాను అని కాకుండా వేరేవాళ్ళకు మాత్రం అసాధ్యం అన్న భావనే అందులో వినిపించింది.

కానీ వేరేవాళ్ళకు మాత్రం అసాధ్యం అన్న భావనే అందులో వినిపించింది.

కానీ వేరేవాళ్ళూ ఇలా అమ్మాలి.

ఎవరైనా కాదు, అలా అందరూ అమ్మాలి.

ఎందుకు?

ఎందుకంటే? ఇపుడంతా ఒక వలయం కదా. రిటైల్ వలయం. రిలయన్స్ ఫ్రెష్, స్పెన్సర్, ఫ్రెష్ ఎట్ ఫలానా...ఫలానా వంటి బహుళజాతి కార్పోరేట్ రిటైల్ వెజిటబుల్ షాపులు మనని చుట్టేస్తున్నాయి. ఒకటికి రెండు రెండుకు నాలుగు తామరతుంపలా పెరిగిపోతూ మనందరినీ అందులోకి లాక్కుంటున్నాయి.

అయితే రెండున్నాయి. ఒకటి, అక్కడ ఫ్రెష్ సరుకు లభిస్తుంది. రెండు, తూకంలో తేడా లేదు.. సౌకర్యం కూడా.

తూకం అంటే మరేం లేదు, ఒక్క వంకాయ కావాలన్నా దొరుకుతుంది. ఒక్క కాకరకాయ కావాలన్నా దొరుకుతుంది. పావుకిలో కొనాల్సిన అవసరమే లేదు. అదీ విషయం. ఇలా ఇవ్వడం వల్లే వినియోగదారులు తోపుడు బళ్ళనుంచీ అటువైపు క్యూ కడుతున్నారు. కానీ అలా ఇవ్వడం మొదలై ఎన్నేళ్ళయ్యింది. ఇటీవలి పరిణామమే. ఐదారేళ్ళుగా మొదలైంది.

కానీ నిసార్?

పద్దెనిమిదేళ్ళుగా ఇస్తున్నాడు.

తాజా ఆకుకూరల్ని కూరగాయల్ని తూకం ప్రసక్తే లేకుండా ఇస్తున్నాడు.

ఎంత కావాలంటే అంత ఏది కావాలంటే అది మిగతా చోట్ల కన్నా చవగ్గా ప్రేమగా అభిమానంగా ఉద్దర కూడా ఇస్తున్నాడు.

ఓ మనిషి మరో మనిషి అవసరాలు తీర్చేందుకు అది ఆర్థిక వ్యవహారమే కానవసరం లేదన్నట్టు, కొలమానం అనవసరం అన్నట్టు ఉన్నాడు.

ప్రపంచీకరణ ప్రపంచీకరణ అంటున్న వేళ దాని దుష్ప్రభావం గురించి ఎంత మొత్తుకుంటే ఏం లాభం. దానికి బదులు నిసార్ వంటి వ్యక్తులు ఒకరికి ఇద్దరు, ఇద్దరికి నలుగురు ఇలా వీషి వీధినా బయలుదేరితే బడా వ్యాపారుల దూకుడుకు ముకుతాడు పడదూ....

తప్పక పడుతుంది.

పడాలి కూడా.

అందుకు నిసార్ ఒక ఆదర్శం.

<u>ఉపసంహారం</u>

అన్నట్టు నిసార్‌ను ఒక్క కూరగాయల అమ్మకానికే ఎందుకు పరిమితం చేయాలి? అతడొక ప్రతీక. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్న వేళ నిసార్ ఒక అసామాన్య ప్రతీక. అనువర్తనా సూత్రం. అతడిని ఎన్ని రంగాలకు వీలైతే అన్ని రంగాలకు విస్తరింప జేయాలి. వర్తింపజేయాలి. అపుడే ఒక మనిషి మరో మనిషి వట్టి చేతులతో చేసే అద్భుతాన్ని చూసినదానికి నిజమైన విలువ.

ఏమంటారు?

మరి కృతజ్ఞతలు.

కందుకూరి రమేష్ బాబు
kandukurirameshbabu@yahoo.co.in

చిరునామా:

నిసార్, ఇంటి నంబరు: 7 - 1 - 46, మసీదు పక్కన,

గాంధీ ప్రకృతి వైద్యశాల బాలుర వసతి గృహం ఎదురుగా,

ధరమ్ కరణ్ రోడ్, హైదరాబాద్,

ఆంధ్రప్రదేశ్, భారత్.

మొబైల్: లేదు.